




పండ్లు, కూరగాయలు సూర్యభగవానుడికి నివేదిస్తూ..



మెరీనా తీరంలో ఛత్ పూజలో పాల్గొన్న ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు



అర్ఘ్యప్రదానం చేస్తున్న మహిళ

ఆదిత్యుడిని కొలిచి.. హారతులిచ్చి

మెరీనా తీరంలో 'ఛత్' పూజ సందడి



ఛత్ పూజలో మహిళ



సంధ్యా వందనంలో మహిళలు

ప్యారీస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత పర్యావరణ అనుకూలమైన పండుగల్లో ఒకటైన 'ఛత్' పూజను నగరంలో ఉన్న ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు మెరీనా సముద్రతీరంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దీపావళి తర్వాత ప్రారంభమయ్యే కార్తీక మాసంలో సూర్య షష్ఠి వ్రతాన్ని ఛత్ పూజగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలో నివసిస్తున్న ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, బిహార్, జార్ఖండ్, యూపీకి చెందిన మహిళలు శుక్రవారం మెరీనా తీరానికి చేరారు. సూర్య భగవానుడికి, ఆయన సోదరి ఛఠీమయాకు కృతజ్ఞతలు తెలుపుతూ దీపాలు వెలిగించి, సముద్రుడికి హారతులిచ్చి ప్రార్థించారు. సూర్య షష్ఠి సందర్భంగా మూడు రాత్రులు, నాలుగు పగల్లు ఉపవాసం చేపట్టి నీటిలో నిలబడి సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాల్లో సంధ్యా వందనం, సాష్టాంగ ప్రణామం చేసి నైవేద్యాలను నివేదించారు. నగరంలో దీపావళి పండుగ అనంతరం తొలి సారి నిర్వహించిన ఛత్ పూజలు నగరవాసులను ఆకట్టుకున్నాయి.

వైభవంగా తిరుకల్యాణోత్సవం

చెన్నై, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరుచెందూరు ఆలయం వద్ద గురువారం సాయంత్రం శూర సంహార దండలు మార్చుకునే కార్యక్రమం జరిగింది. లక్షలాది మంది భక్తులు ఈ వేడుకలలో పాల్గొన్నారు. శూరసంహారం ఘట్టం, తిరుకల్యాణం ముగిసిన తర్వాతే భక్తులు షష్ఠి వ్రతాన్ని ముగించటం ఆనవాయితీ. అందుకే స్వామివారి తిరుకల్యాణోత్సవం తిలకించేందుకు రెండు రోజులుగా తిరుచెందూరులోనే బసచేశారు. ఇక శుక్రవారం రాత్రి ఆలయం వద్దనున్న తిరుకల్యాణ మండప వివాహ వేదికపై సర్వాలంకరణ శోభితులై ఆశీనులైన కుమారవిడంగ పెరుమాల్‌కు దేవసేనకు తిరుక ఘట్టం ముగియడంతో శుక్రవారం నుంచి తిరుకళ్యాణ ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఆ మేరకు వేకుడజాము 3 గంటలకు ఆలయాన్ని తెరచి, 3.30 గంటలకు విశ్వరూపదర్శనం, 4.30 గంటలకు ఉదయమార్తండ అభిషేకం, ఉదయం 6 గంటలకు అమ్మవారు తపస్సుకు బయలుదేరి, సన్నిధి వీధి, వీరరాఘవపురం వీధి, సభాపతి పురం వీధి, దక్షిణ రథవీధి మీదుగా తీర్థకొలను సమీపంలో తపస్సు మండపానికి చేరుకున్నారు. అమ్మవారి సప్పరానికి ముందు రామయ్యా భాగవతార్ స్మారక సెంథిల్ మురుగన్ మాధ్యమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, భక్తులు 'సెంథిల్ కురవంజి' పాటలను గానం చేశారు. ఉదయం 9 గంటలకు ఉచ్చికాల దీపారాధన, సాయంత్రం ఆరుగంటలకు స్వామి, అమ్మవార్ల ల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఇదే విధంగా వడపళని మురుగన్ ఆలయంలో తిరుప్పరంకుండ్రం, ప్యారీస్‌కార్నర్ కందకోట్టమ్ సహా పలు మురుగన్ ఆలయాల్లో స్వామివారి కల్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి.



ప్రత్యేక అలంకరణలో సప్పరంపై తపస్సు మండపానికి వెళ్తున్న దేవసేన





వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొత్త భవనాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

అభివృద్ధి పనులు..

ఉద్యోగ నియామకాలు

రూ.171.16 కోట్లతో తరగతి గదులు, హాస్టల్ భవనాలు ● ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ ఆధ్వర్యంలో రూ.171.16 కోట్లతో నిర్మించిన పాఠశాల తరగతి గదులు, హాస్టల్ భవనాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో 29 జిల్లాల్లో 141 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మించిన 754 తరగతిగదులతో కూడిన భవనాలు, 17 ప్రయోగశాల భవనాలు, కళ్లకురిచ్చి జిల్లా శంకరాపురంలో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ భవనం, పెరంబలూరు జిల్లా ఆలందూరు యూనియన్ మలయప్పనగర్‌లో, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవిష్య విద్యాలయ రెసిడెన్షియల్ పాఠశాల భవనాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఇదే విధంగా పాఠశాలల విద్యాశాఖలో విధినిర్వహణలో మృతిచెందిన ఉద్యోగుల వారసులు 49 మందికి కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగ నియామక పత్రాలను కూడా స్టాలిన్ అందజేశారు.. ఈ కార్యక్రమంలో మంత్రులు ఈవీ వేలు, కె.పొన్ముడి, అన్బిల్ మహేష్ , ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎన్.మురుగానందం, పాఠశాలల విద్యాశాఖ కార్యదర్శి ఎస్.మధుమతి, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఎస్.కన్నప్పన్, ప్రాథమిక విద్యాశాఖ సంచాలకులు పీఏ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

246 మంది ఏఈలకు నియామక ఉత్తర్వులు...

సచివాలయంలో జరిగిన మరో కార్యక్రమంలో కంబైన్డ్ ఇంజనీరింగ్ సర్వీస్ ఎగ్జామినేషన్స్ సంస్థ నిర్వహించిన పోటీ పరీక్షలలో ఉత్తీర్ణులై ఏఈలుగా ఎంపికైన 246మందికి ముఖ్యమంత్రి స్టాలిన్ ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, కె.పొన్ముడి, ఈవీ వేలు, వి.సెంథిల్‌బాలాజీ, ప్రజా పనుల శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంగత్‌రామ్ శర్మ, ఇంధన శాఖ తాగునీటి సరఫరా శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి డి.కార్తికేయన్, రాష్ట్ర విద్యుత్ బోర్డు చైర్మన్ కే నందకుమార్, రహదారులు, చిన్న ఓడరేవుల శాఖ కార్యదర్శి డాక్టర్ ఆర్ సెల్వరాజ్, రాష్ట్ర నీటి సరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి. దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా అర్చనా పట్నాయక్



చెన్నై, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా అర్చనా పట్నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అర్చన తమిళనాడు మొదటి మహిళా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్. ఆమె ప్రస్తుతం తమిళనాడు చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ కార్యదర్శిగా ఉన్నారు. ప్రస్తుతం ప్రధాన ఎన్నికల అధికారిగా ఉన్న సత్యప్రద సాహూ కొద్ది రోజుల క్రితం పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిగా బదిలీ అయిన విషయం తెలిసిందే.



శుక్రవారం చెన్నై టి.నగర్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన శృంగేరి శారదాపీఠాధిపతి విధుశేఖర భారతిస్వామికి స్వాగతం పలుకుతున్న టీటీడీ చెన్నై సమాచారకేంద్ర సలహామండలి మాజీ అధ్యక్షులు ఏజే శేఖర్, ఎన్.శ్రీకృష్ణ, ఆనందకుమార్‌రెడ్డి, ఇతర సభ్యులు

ఆరోగ్యశాఖ పథకానికి ఐరాస అవార్డు

సీఎం స్టాలిన్‌కు అందజేత ● వైద్య మంత్రికి అభినందనలు



ఐరాస అవార్డుతో సీఎంను కలిసిన ఆరోగ్యశాఖ మంత్రి

అడయార్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న 'మక్కలై తేడి మరుత్తువం' పథకానికి ఐక్యరాజ్య సమితి అవార్డు వరించింది. దీన్ని అందుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి ఎం.సుబ్రమణ్యం శుక్రవారం సీఎం స్టాలిన్‌ను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వైద్య మంత్రిని, ఆరోగ్యశాఖను సీఎం స్టాలిన్ ప్రత్యేకంగా అభినందించారు. 2021 అగస్టు నెల 5వ తేదీ కృష్ణగిరి జిల్లాలో ఈ పథకాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ఈ పథకం ప్రారంభించినప్పటి నుంచి ఈ నెల 7వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1,98,25,487 మందికి ప్రాథమిక వైద్యం, 4,22,79,337 మంది రోగం నయమయ్యేంతవరకు వైద్య సేవలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 25న న్యూయార్క్ నగరంలో 79వ ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం జరిగింది. 'లెవెన్ ఫ్రెండ్స్ ఆఫ్ ది టాస్క్ ఫోర్స్' పేరుతో నిర్వహించగా, ఇందులో మక్కలై తేడి మరుత్తువం పథకానికి ఐరాస అవార్డును అందజేశారు. ఈ అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని వైద్య మంత్రి సుబ్రమణ్యం సీఎం స్టాలిన్‌కు చూపించి అభినందనలు పొందారు. అలాగే, రాష్ట్ర వ్యాప్త ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహారంతో కూడి ఆహార ధాన్యాలతో పాటు కిరాణా సరకులను అందజేస్తున్నందుకు కూడా ఐక్యరాజ్య సమితి అభినందించింది. 2023-24 సంవత్సరంలో నాణ్యమైన ఆహార సరకులను పంపిణీ చేసిన రెండో రాష్ట్రంగా తమిళనాడు నిలిచింది. దీన్ని కూడా ఐరాస గుర్తించి, అభినందించడం గమనార్హం.

రెండు రోజుల్లో అల్పపీడనం

● 11, 13 తేదీల్లో కుండపోత ?

చెన్నై, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో రెండు రోజుల్లో అల్ప పీడనం ఏర్పడనుందని వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. ఈ అల్ప పీడనం వాయుగుండంగా మారే అవకాశాలుండటంతో రాష్ట్రంలో పలు చోట్ల చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయన్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 11, 13 తేదీల్లో రాజధాని నగరం చెన్నైలో పలు చోట్ల కుండపోత వర్షం కురిసే అవకాశముందని తెలిపారు. ఇక ఈశాన్య బంగళాఖాతంలో ఏర్పడనున్న అల్ప పీడనం రెండురోజుల్లో పడమటి దిశగా శ్రీలంక తీరం వైపు నెమ్మదిగా కదులుతుందని తెలిపారు.

ఈశాన్య అరేబియా సముద్రం పరిసర ప్రాంతాల్లో లక్షద్వీపాల్లో ఉపరితల ఆవర్తనం నెలకొనడటంతో కన్నియాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఈ నెల 10న కడలూరు, మైలాడుదురై, నాగపట్టినం, తంజావూరు, తిరువారూరు, పుదుకోట జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తాయన్నారు. ఈ నెల 11, 13 తేదీల్లో చెన్నై, చెంగల్పట్టు కాంచీపురం, తిరువళ్లూరు, రామనాథపురం, పుదుకోట, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై, కడలూరు, విల్లుపురం జిల్లాల్లో, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాలలోనూ పలుచోట్ల కుండపోతగా వర్షాలు కురుస్తాయన్నారు. ఈ నెల 12న కన్నియాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడి, తెన్‌కాశి, విరుదునగర్, మదురై, శివగంగ, రామనాథపురం, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, కడలూరు, మైలాడుదురై తదితర జిల్లాల్లో చెదురుముదురుగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు.

కలిసొచ్చే పార్టీలతో దోస్తీ...?

● టీవీకే అధ్యక్షుడు విజయ్



ప్యారీస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరుగనున్న ఎన్నికల్లో భావ సారూప్యత కలిగిన పార్టీలతో చేతులు కలిపేందుకు తమిళగ వెట్రి కళగం (టీవీకే) సిద్ధమైంది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత విజయ్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అగ్రనటుడిగా రాణిస్తున్న విజయ్ ప్రారంభించిన టీవీకే తొలి మహానాడు ఇటీవల విల్లుపురం జిల్లా విక్రవాండిలో విజయవంతంగా జరిగిన విషయం తెలిసిందే. ఈ మహానాడులో రాష్ట్రంలో అధికారంలో ఉన్న డీఎంకే, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలను విజయ్ తీవ్రంగా విమర్శించారు. దానికి ఈ రెండు పార్టీల నేతలు ఖండించారు. ఈ నేపథ్యంలో 2026లో రాష్ట్ర అసెంబ్లీకి జరుగబోయే ఎన్నికలకు అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకే సహా అన్ని పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఎన్నికలకు 15 నెలల గడువున్నప్పటికీ, కూటమిపై దృష్టి సారించిన పార్టీలు ప్రజాదరణ పొందిన పార్టీలతో పొత్తు కుదుర్చుకొనే ప్రయత్నాల్లో దిగాయి. పార్టీ తొలి మహానాడులో ప్రసంగించిన విజయ్.. అసెంబ్లీ ఎన్నికల్లో తమ నాయకత్వాన్ని అంగీకరించే పార్టీలతో దోస్తీ కడతానని వెల్లడించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా అధికారంలో కూడా మిత్రపక్షాలకు భాగస్వామ్యం కల్పిస్తామని ప్రకటించారు. ఈ ప్రకటనతో విజయ్‌తో పొత్తు కుదుర్చుకొనేందుకు కొన్ని పార్టీలు నిర్ణయం తీసుకున్నప్పటికీ, దీనిపై బహిరంగ ప్రకటన చేయలేదు. ఇదిలా ఉండగా, టీవీకే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర పార్టీల నాయకత్వం కింద పనిచేసేందుకు ఇష్టపడదని, తమ సిద్ధాంతాలకు కట్టుబడి తమ నాయకత్వాన్ని అంగీకరించే పార్టీలతోనే విజయ్ పొత్తు కుదుర్చుకుంటారని టీవీకే సీనియర్లు చెబుతున్నారు.

సమాచార దర్శిని

శబరిమలకు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్పస్వామి మండల పూజను పురస్కరించుకొని చెన్నై సహా పలు నగరాల నుంచి 60 రోజులు ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఈ విషయమై రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎస్ఈటీసీ) విడుదల చేసిన ప్రకటనలో... ఈ నెల 15 నుంచి జనవరి 16వ తేది వరకు కోయంబేడు, కిలంబాక్కం, తిరుచ్చి, మదురై, కడలూరు, పుదుచ్చేరిల నుంచి కేరళ రాష్ట్రం పంబకు ఏసీ స్లీపర్ బస్సులు నడుపనున్నామన్నారు. బృందాలుగా వెళ్లే భక్తులకు అద్దెకు బస్సులు ఇస్తామని తెలిపింది. భక్తులు www.tnstc.in వెబ్‌సైట్, TNSTC యాప్ ద్వారా బస్సులకు రిజర్వేషన్ చేసుకోవచ్చు. వివరాలకు 9445014452, 9445014424, 9445014463 అనే నెంబర్లు సంప్రదించాలని ఎస్ఈటీసీ తెలిపింది.

అంబేడ్కర్' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ పురస్కారానికి ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు సచివాలయం శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... షెడ్యూల్డ్ కులాలు, తెగల అభ్యున్నతికి కృషిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఒకరికి అంబేడ్కర్ పురస్కారం అందజేస్తోంది. 2024వ సంవత్సరానికి గాను ఈ పురస్కారానికి ఆసక్తి కలిగిన వారు www.tn.gov.in/ta/forms/De-ptname/1 వెబ్‌సైట్‌లో తమ వివరాలు, కార్యక్రమాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు ఆయా జిల్లా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కార్యాలయాలను సంప్రదించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది.

గ్రూప్-4 పోస్టుల తాత్కాలిక జాబితా

పెరంబూర్, నవంబరు 8 ఆంధ్రజ్యోతి): గ్రూప్-4 పరీక్షా ఫలితాల ప్రకారం తాత్కాలికంగా ఎంపికైన వారి జాబితాను టీఎన్‌పీఎస్సీ విడుదల చేసింది. అభ్యర్థులు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో జాబితా తెలుసుకోవచ్చు. అలాగే, అభ్యర్థులు ఈ నెల 9 నుంచి 21వ తేది వరకు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని అధికారులు సూచించారు.

వర్సిటీలు, కళాశాలల్లో ప్లాస్టిక్ నిషేధం

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ ఉత్పత్తులు నిషేధించాలని, ఉల్లఘించిన వారిపై చర్యలు చేపడతామని యూజీసీ హెచ్చరించింది. ఈ మేరకు అన్ని ఉన్నత విద్యా సంస్థలకు యూజీసీ కార్యదర్శి మనీష్‌జోషి పంపిన సర్క్యులర్‌లో... ప్లాస్టిక్ వినియోగం వలన ఏర్పడే వాతావరణ కాలుష్యం గురించి విద్యార్థులకు తెలియజేయాలన్నారు. విద్యాసంస్థల ప్రాంగణాల్లోని హోటళ్లు, హాస్టళ్లలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ వినియోగం తగ్గించేలా నీటి తొట్టెలు ఏర్పాటుచేయాలన్నారు. అలాగే, పాలిథిన్ కవర్లకు బదులుగా గుడ్డ, కాగితపు సంచులు విద్యార్థులు వినియోగించేలా చర్యలు చేపట్టాలని, నిబంధనలు అతిక్రమించిన సంస్థలపై చర్యలు చేపడతామని యూజీసి హెచ్చరించింది.

22 మెగావాట్లకు తగ్గిన పవన విద్యుదుత్పత్తి

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో గాలుల వేగం అధికంగా ఉండడంతో ప్రతి రోజు 3,500 నుంచి 4,500 మెగావాట్ల పవన విద్యుత్ లభిస్తుంది. ప్రస్తుతం ఈశాన్య రుతుపవనాలు ప్రారంభం కావడంతో గాలుల వేగం తగ్గింది. దీంతో, బుధవారం 84 మెగావాట్లున్న పవన విద్యుదుత్పత్తి, గురువారం 22 మెగావాట్ల మేర తగ్గింది. కాగా, రోజువారీ విద్యుత్ వినియోగం 15,946 మెగావాట్లుగా ఉందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పూందమల్లి పరిధిలోని కుయిన్‌విక్టోరియా రోడ్డు, అంబాళ్ నగర్, చక్రమంగళా నగర్, శరవణ నగర్, జేమ్స్ వీధి, శ్రీనివాస నగర్, మల్లియం నరసింహ నగర్, బలరామన్ నగర్, సుందర్ నగర్, షిర్డీసాయి నగర్, సుమిత్ర నగర్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పాఠశాల విద్యార్థులకు రోబోటిక్ శిక్షణ

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు రోబోటిక్ శిక్షణ ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకోసం మైక్రోసాఫ్ట్, డీసాల్ట్ సిస్టమ్స్‌తో పాఠశాల విద్యాశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు తెలిపేలా కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా రోబోటిక్స్, కోడింగ్, ఉత్పత్తి అభివృద్ధిపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. తొలివిడతగా వెయ్యి పాఠశాలలు ఎంపిక చేసి 38 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నామని, అనంతరం ఈ శిక్షణ అన్ని పాఠశాలలకు విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు యధావిధిగా విద్యాసంస్థలు

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శనివారం పాఠశాలలు, కళాశాలలు యధావిధిగా పనిచేయనున్నాయి. దీపావళి పండుగ సందర్భంగా గత నెల 31న ప్రభుత్వ సెలవుదినంగా కాగా, మరుసటిరోజు శుక్రవారం పనిదినం, శని, ఆదివారాలు సెలవు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం కూడా సెలవు ప్రకటించిన ప్రభుత్వం, ఈ నెల 9, శనివారం పనిదినంగా ప్రకటించిన విషయం తెలిసిందే.

ఆవిన్ ఉత్పత్తులకు పెరిగిన డిమాండ్

● మంత్రి రాజకన్నప్పన్



తిరుప్పూర్ ఆవిన్ పాల ఉత్పత్తి ప్లాంట్‌ను కలెక్టర్, ఎమ్మెల్యేలతో కలసి పరిశీలిస్తున్న మంత్రి రాజకన్నప్పన్

ప్యారీస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆవిన్ ఉత్పత్తులకు డిమాండ్ బాగా పెరిగిందని, కోవైలో త్వరలోనే పన్నీర్ ఫ్యాక్టరీ ప్రారంభించనున్నామని మంత్రి రాజకన్నప్పన్ పేర్కొన్నారు. తిరుప్పూర్ వీరపాండి ప్రాంతంలోని ఆవిన్ ప్లాంట్‌ను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే సెల్వరాజ్, మేయర్ దినేష్‌కుమార్, కలెక్టర్ క్రిస్తురాజ్ తదితరులతో కలిసి మంత్రి రాజకన్నప్పన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ఆవిన్ ద్వారా తిరుప్పూర్ జిల్లాలో దాదాపు 1.80 లక్షల లీటర్ల పాలను రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో 40 వేల లీటర్ల పాలను ప్యాకెట్ల ద్వారా విక్రయించి మిగతా పాలు కోవై జిల్లాకు సరఫరా చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఆవిన్ పాలతో తయారుచేస్తున్న ఉత్పత్తుల నాణ్యత, శుభ్రత మెరుగుపరచడం ద్వారా వీటికి డిమాండ్ బాగా పెరిగిందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు లబ్ధిపొందేలా ఆవిన్ సంస్థ పనిచేస్తున్నందువల్లే ధరలు పెంచలేదని మంత్రి తెలిపారు.



చెన్నై కొరట్టూరు భక్తవత్సలం పాఠశాలలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన, ప్లాస్టిక్ రహిత సమాజం రూపొందిస్తామంటూ సామూహిక ప్రతిజ్ఞచేస్తున్న విద్యార్థులు.

కొడుకు,కోడలితో వస్తారనుకున్నా..

సెల్వరాజ్ మృతి పట్ల స్టాలిన్ సంతాపం

చెన్నై, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వివాహానంతరం కొడుకు కోడలితో తనను కలిసేందుకు చెన్నై వస్తాడనుకున్న కోవై సెల్వరాజ్ హఠాన్మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సీఎం ఎం.కె.స్టాలిన్ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే, డీఎంకే ప్రచార విభాగ కార్యదర్శి కోయంబత్తూరు సెల్వరాజ్ (66) తిరుమలలో గురువారం రాత్రి జరిగిన కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. తిరుగుప్రయాణంలో తీవ్ర గుండెపోటుకు గురికాగా, ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్ర సంతాపం ప్రకటించారు. శుక్రవారం రాత్రి సీఎం విడుదల చేసిన ప్రకటనలో సెల్వరాజ్ మృతి తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. డీఎంకే విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరినప్పటి నుంచి ఎనలేని సేవ చేసారని గుర్తు చేసుకున్నారు. టీవీల్లో జరిగే విస్తృత చర్చల్లో నిరాటంకంగా పాల్గొనేవారని తెలిపారు. ఇటీవల తాను కోవై వెళ్లినప్పుడు కూడా ఎంతో ఉత్సాహంగా కార్యక్రమాల్లో పాల్గొన్నారని, నూతన వధూవరులతో కలిసి చెన్నై వస్తానని చెప్పారని గుర్తు చేసుకున్నారు. అయితే ఇంతలోనే ఆయన కన్నుమూయడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. సెల్వరాజ్ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. స్టాలిన్‌తో పాటు వివిధపార్టీల నేతలు కూడా సెల్వరాజ్ మృతికి సంతాపం తెలిపారు.

ఆస్పత్రి, పాఠశాలలో కలెక్టర్ తనిఖీ



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 8 (అంధ్రజ్యోతి): పొయిగై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి శుక్రవారం పరిశీలించారు. ఔట్, ఇన్ పేషంట్ల విభాగాలు, ల్యాబ్, మహిళా వార్డు, స్కానింగ్ కేంద్రం, ప్రసవ వార్డులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పొయిగై ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. 10వ తరగతి క్వార్టర్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించిన కలెక్టర్, వారికి పుస్తకాలు బహుమతిగా అందజేశారు. కలెక్టర్ వెంట ఆనైకట్టు తహసీల్దార్ వేండా, ఆస్పత్రి ఉద్యోగులు, ఉపాధ్యాయులున్నారు.

వెంబకోట తవ్వకాల్లో ఆభరణాల రాళ్లు లభ్యం



లభ్యమైన రాళ్లు

ప్యారీస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా వెంబకోటలో చేపట్టిన మూడో విడత తవ్వకాల్లో ఆభరణాల తయారీకి అవసరమయ్యే అరుదైన రాళ్లు లభ్యమయ్యాయి. రాష్ట్ర పురావస్తు శాఖ నిపుణులు ప్రభుత్వ అనుమతితో చేపట్టిన తవ్వకాల్లో ఇప్పటివరకు ఆదివాసీలకు సంబంధించిన కట్టడాలు, బొమ్మలు, చదరంగం పావులు సహా 2,400లకు పైగా వస్తువులు లభ్యమయ్యాయి. ఈ నేపథ్యంలో, ఇటీవల జరిపిన తవ్వకాల్లో సుమారు 6 వేల సంవత్సరాల క్రితం నాటి ఆభరణాల్లో ఉపయోగించే రాళ్లు బయల్పడ్డాయి. ఈ రాళ్ల పురాతన కాలంలో వన్యమృగాలు వేటాడేందుకు రాతితో తయారుచేసే ఆయుధాల్లో ముడి పదార్థంగా వినియోగించినట్లు పురావస్తు శాఖ డైరెక్టర్ భాస్కర్ పొన్నుస్వామి తెలిపారు.

వైద్యకేంద్రాల్లో పాము కాటుకు మందు

● రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాము, తేళ్లు, కుక్క సహా ఇతర జంతువుల కాటుకు గురైన వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సహా అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో 24 గంటలు చికిత్స అందిస్తున్నారు. అలాగే, విషంతో కూడిన మరణాలను అడ్డుకొనేలా రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో, పాము కాటును గుర్తించదగిన వ్యాధి గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ ప్రకారం, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో పాటు కాటుకు చికిత్స పొందుతున్న వారి వివరాలు ప్రభుత్వానికి తెలియజేయాలి. ఈ ప్రక్రియతో పాటుకాటుకు సంబంధించిన డేటా విశ్లేషించడం ద్వారా పాము కాటు చికిత్సకు అవసరమైన మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు అవకాశముంటుందని రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది.

మేట్టూరు డ్యాంలో పూడికతీత పనులు

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలోని మేట్టూరు డ్యాం ప్రారంభించిన 90 ఏళ్ల తర్వాత తొలిసారి పూడికతీత పనులు చేపట్టనున్నారు. ప్రయోగాత్మకంగా డ్యాంలోని నిర్దిష్ట ప్రాంతంలో 1.40 లక్షల యూనిట్ల మట్టి తొలగించనున్నారు. ఇందుకోసం పర్యావరణ, అటవీ అనుమతులు పొందేందుకు కన్సల్టెంట నియామకానికి జలవనరుల శాఖ టెండర్లు ఆహ్వానించింది. అనుమతి వచ్చిన వెంటనే చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

వైద్యుడికి రూ.70 లక్షల కుచ్చుటోపీ

ప్యారీస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపూరులో ఓ దంత వైద్యుడికి రూ.15 కోట్ల బ్యాంకు రుణం ఇప్పిస్తానని నమ్మించి రూ.70 లక్షలు మోసం చేసిన వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. తిరుపూరు కాలేజీ రోడ్డుకు చెందిన కిషోర్ కుమార్ (45) అనే దంత వైద్యుడు ఆస్పత్రి నడుపుతున్నారు. ఈ ఆస్పత్రి శాఖలు చెన్నై, కోవైలో కూడా ఉన్నాయి. ఈ ఆస్పత్రిని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించే నిమిత్తం బ్యాంకు నుంచి రుణం తీసుకోవాలనుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కోవైకు చెందిన శక్తివేల్ రూపాయి వడ్డీకి రూ.15 కోట్ల రుణాన్ని బ్యాంకు నుంచి ఇప్పిస్తానని నమ్మించడంతో కమిషన్ రూపంలో రూ.70 లక్షలు ఇచ్చాడు. డబ్బులు తీసుకున్న తర్వాత రుణం ఇప్పించకపోవడంతో కిషోర్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఊటీ, కొడైకెనాల్‌లో ఈ-పాస్ కొనసాగింపు

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీ, దిండుగల్ జిల్లా కొడైకెనాల్ తదితర పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వారికి ఈ-పాస్ విధానం కొనసాగించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు హైకోర్టు ఆదేశించింది. ఊటీ, కొడైకెనాల్‌లో వాహనాల రద్దీ నియంత్రించేలా గత వేసవి సెలవుల నుంచి ఈ-పాస్ విధానం అమలులో ఉంది. ఆ ప్రకారం, పర్యాటకులు తమ వాహనాలకు ఆన్ లైన్ ద్వారా పాస్ పొందే పదుపాయం కల్పించారు. ఈ నేపథ్యంలో,ఈ విధానానికి సంబంధించిన కేసు విచారణ శుక్రవారం వచ్చిన సమయంలో హైకోర్టు, ఈ-పాస్ విధానం పర్యాటకులను ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశం కాదని, పర్యాటకుల వివరాలు తెలుసుకొనేందుకు మాత్రమేనని, అందువల్ల ఈ-పాస్ విధానం కొనసాగుతుందని ప్రకటించి, తదుపరి విచారణ డిసెంబరు 2వ తేదీకి వాయిదావేసింది.

తరగతి గదిలో బాలిక ప్రసవం

చెన్నై, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని నామక్కల్ జిల్లా పళ్ళిపాళయం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్లస్ -1 విద్యార్థినికి తరగతిలో పురుటినొప్పులు రావడం కలకలం రేపింది. వివరాలిలా... శుక్రవారం ఉదయం తరగతి గదిలో ఉన్న ఆ బాలికకు హఠాత్తుగా కడుపునొప్పితో విలవిల్లాడిపోయింది. దీంతో ఉపాధ్యాయులు హుటాహుటిన ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్ళారు. అక్కడ చేరిన కొద్దిసేపటికే ఆ బాలిక ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు రాశిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో ఆ బాలిక గర్భానికి ఆమె దూరపు బంధువైన రంగరాజన్ (28) కారణమని తేలింది. పెళ్ళి చేసుకుంటానని నమ్మించి ఆమెను మోసం చేసినట్లు వెల్లడైంది. దీంతో పోలీసులు రంగరాజన్‌ను అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

కరుణానిధి గురించి అనుచిత వ్యాఖ్యలు

● సీమాన్‌పై కొత్త కేసు

ప్యారీస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన నామ్ తమిళర్ పార్టీ ఆర్గనైజర్ సీమాన్‌పై కోర్టు ఉత్తర్వుల మేరకు కొత్త కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. విల్లుపురం జిల్లా విక్రవాండి శాసనసభ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నిక సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీమాన్ పాల్గొన్నారు. ఈ సభలో చాట్టై దురైమురుగన్, కరుణానిధిని కించపరిచేలా పాడిన పాటను డీఎంకే ప్రముఖులు తీవ్రంగా ఖండించారు. అయితే ఆ పాటలో కరుణానిధిని కించపరచలేదంటూ వివరించిన సీమాన్, అదే పాట సభలో పాడారు. దీంతో, సీమాన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కరూర్‌కు చెందిన న్యాయవాది తమిళ్‌రాజేంద్రన్ జిల్లా కలెక్టర్‌కు ఆగస్టు 5న ఫిర్యాదు చేశారు. అయితే సీమాన్‌పై ఎలాంటి చర్యలు లేకపోవడంతో కరూర్ మేజిస్ట్రేట్ కోర్టులో తమిళ్‌రాజేంద్రన్ పిటిషన్ వేశారు. గురువారం ఈ పిటిషన్ విచారణకు రాగా, ఈ నెల 17వ తేదిలోగా సీమాన్‌పై కేసు నమోదుచేసి నివేదిక దాఖలు చేయాల్సిందిగా న్యాయస్థానం పోలీసులకు ఉత్తర్వులు జారీచేసింది.

రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం

● పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి



మీడియాతో మాట్లాడుతున్న డా.అన్బుమణి

వేలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటవుతోందని పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి రాందాస్ జోస్యం చెప్పారు. నగరంలో జరిగిన పలు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ... కడలూరు జిల్లా భువనగిరిలో తమ పార్టీకి చెందిన ఓకార్యకర్తపై కొందరు మద్యం మత్తులో దాడిచేయగా, అతడు తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. ఈ ఘటనకు కారణమైన వారిని అరెస్ట్ చేయని పోలీసులు, తమ పార్టీ కార్యకర్తలపై కేసు నమోదుచేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. తమ పార్టీ గురించి డీపీఐ కార్యకర్తలు తీవ్ర విమర్శలు చేస్తున్నారని, ఈవిషయమై పోలీసులకు ఫిర్యాదుచేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. ఇటీవల కోవైలో పర్యటించిన మంత్రి ఆరేళ్ల క్రితం ఉద్యోగాల పేరుతో డబ్బు కాజేసిన మంత్రి సెంథిల్ బాలాజీని పొగడడమే ద్రావిడ పాలనా అంటూ ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ జిల్లా సెక్రటరీ శరవణన్ సహా పలువురు నేతలున్నారు.

ఇంటికోసం విద్యుత్ టవరెక్కి...



టవర్ నుంచి కిందకు దిగిన సతీష్ పాండ్యన్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

చెన్నై, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోతుల మూక ధ్వంసం చేసిన తన ఇంటిని మరమ్మతు చేసేందుకు నిరాకరించిన అధికారుల వైఖరికి నిరసనగా ఓ వ్యక్తి విద్యుత్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలిలా.. దిండుగల్ జిల్లా నత్తం సమీపం కణవాయ్‌పట్టిలో సతీష్‌పాండ్యన్ (36) అనే వ్యక్తి నివసిస్తున్నాడు. ఇటీవల అతడి ఇంటిలో కోతులు ప్రవేశించి వస్తువులను, ఇంటిని ధ్వంసం చేశాయి. దీంతో తన ఇంటిని మరమ్మతు చేసి ఇవ్వాలని, లేదా కొత్తగా ఇల్లు నిర్మించి ఇవ్వాలని పంచాయతీ యూనియన్ అధికారులకు పలు మార్లు వినతి పత్రాలు సమర్పించాడు. అధికారులు ఎలాంటి సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహించిన సతీష్‌పాండ్యన్ శుక్రవారం ఉదయం మంగమ్మాళ్‌రోడ్డు ప్రాంతంలో ఉన్న విద్యుత్ టవర్ ఎక్కాడు. అది చూసిన స్థానికులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. విద్యుత్ టవర్ ఎక్కిన సతీష్‌పాండ్యన్ తన ఇంటిని మరమ్మతు చేసి ఇవ్వాలని లేకుంటే విద్యుత్ వైర్లు పట్టుకుంటానని, లేదా కిందకు దూకి ఆత్మహత్య చేసుకుంటానని కేకలు పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ యూనియన్ అధికారులు అక్కడికి వెళ్లి అతడితో మాట్లాడి, ధ్వంసమైన ఇంటిని మరమ్మతు చేసి ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది భారీ నిచ్చెన వేసి అతడిని కిందకు దించారు.

సేలంలో రౌడీ హత్య

ప్యారీస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సేలంలో కారులో వెళుతున్న రౌడీని అడ్డగించిన ఓ కిరాయి ముఠా అతడిని దారుణంగా హతమార్చి పరారైంది. సేలం వీరాణం సమీపంలోని వెలియంపట్టికి చెందిన శరవణన్ (32) అనే రౌడీషీటర్ రోజులాగే శుక్రవారం ఉదయం కూడా తాను నిర్వహిస్తున్న బీరువా కంపెనీకి కారులో బయల్దేరాడు. అతను సేలం వలసయూరు చేరుకున్న సమయంలో గుర్తుతెలియని ముఠా కారు ఆపి శరవణన్‌ను బయటకు ఈడ్చి మారణాయుధాలతో దాడిచేయడంతో, తీవ్రంగా గాయపడిన శరవణన్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని సేలం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ హత్యకు పాల్పడిన కిరాయి ముఠా కోసం ప్రత్యేక పోలీసు బృందం ఏర్పాటైంది. పట్టపగలు జనసంచారం ఉన్న ప్రాంతంలో జరిగిన ఈ హత్యా ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

హోటల్ బిల్లు చెల్లించని ఇద్దరి అరెస్టు

అడయార్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో జరిగిన ఆర్మీ రిక్రూట్మెంట్ క్యాంపులో పాల్గొన్న ఇద్దరు యువకులను ఆ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరు బస చేసిన హోటల్‌కు బిల్లు చెల్లించకపోవడంతో హోటల్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు అరెస్టు చేశారు. కొన్ని రోజుల క్రితం ఈ ఆర్మీ రిక్రూట్మెంట్ క్యాంపు జరిగింది. ఇందులో కృష్ణగిరి జిల్లా బర్గూరుకు చెందిన భాస్కర్, భరత్ అనే ఇద్దరు యువకులు పాల్గొన్నారు. వీరిద్దరూ కోవై పీలమేడు ప్రాంతంలో హోటల్‌లో ఓ గది అద్దెకు తీసుకుని, గురువారం సాయంత్రం ఖాళీ చేశారు. హోటల్ బిల్లు రూ.5,798 చెల్లించాల్సి ఉండగా, వారు బిల్లు చెల్లించలేదు. పైగా బిల్లు చెల్లించినట్లుగా నకిలీ స్క్రీన్ షాట్ ఒకటి షేర్ చేసి గది ఖాళీ చేశారు. డబ్బులు జమ కాకపోవడంతో మేనేజర్ ఫోన్ చేసి అడగ్గా దుర్భాషలాడారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, ఆ యువకులను అరెస్టు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వేలూరు, నవంబరు 8 (అంధ్రజ్యోతి): స్థానిక హరినాథపురానికి చెందిన హరిహరన్ (27) అరదావికమ్‌లోని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నారు. గురువారం స్నేహితులను కలిసేందుకు హరిహరన్ ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. సత్తువాచేరి కలెక్టర్ కార్యాలయం సమీపం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో హఠాత్తుగా స్కూటర్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో హరిహరన్ తీవ్రగాయాలతో మృతిచెందాడు. వేలూరు దక్షిణం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

శ్మశానికి రోడ్డుకోసం రాస్తారోకో



రాస్తారోకో చేపట్టిన మృతుడి బంధువులు

వేలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాట్పాడి సమీపం కుప్పురెడ్డియార్ ప్రాంతానికి చెందిన నరసింహన్ (90) వృద్ధాప్యం కారణంగా మృతిచెందారు. అతడికి అంత్యక్రియలు నిర్వహించేందుకు ఓ ప్రైవేటు స్థలం మీదుగా పొన్నై శ్మశానవాటికకు వెళ్లాల్సి ఉంది. కానీ, ఆ మార్గంగా వెళ్లేందుకు స్థల యజమాని అంగీకరించలేదు. దీంతో ఆగ్రహించిన మృతుడి బంధువులు మృతదేహంతో పొన్నై రోడ్డుపై బైఠాయించి రాస్తారోకోకు దిగారు. అక్కడకు చేరుకున్న పోలీసులు ఆందోళనకారులతో చర్చించి, శ్మశానానికి మరో మార్గంలో వెళ్లాలని సూచించారు. దీంతో, 5 కి.మీ దూరం వెళ్లి శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు బాధితులు తెలిపారు.

వాననీటి తొలగింపునకు ఏం చేస్తున్నారు...?

● జీసీసీకి హైకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై పరిధిలోని వాషర్‌మెన్‌పేటలో వాననీటి తొలగింపునకు తీసుకున్న చర్యల గురించి నివేదిక దాఖలు చేయాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)కు మద్రాసు హైకోర్టు ఆదేశించింది. వాషర్‌మెన్‌పేటలోని రత్న సభాపతి రోడ్డులో ప్రతి ఏటా వర్షాకాలంలో వరద నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారంటూ మాథ్యూ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. అందులో... రత్నసభాపతి రోడ్డులో పాఠశాలలు, విద్యార్థుల హాస్టళ్లు, ఆస్పత్రి, ఇళ్లు అధికంగా ఉన్నాయని, ఇక్కడ నివసిస్తున్న ప్రజలు వర్షాలు కురిసే సమయంలో వరద నీటిలో చిక్కుకొని ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు జీసీసీకి విన్నవించుకున్నా నాలుగేళ్లుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఆ ప్రాంతంలో ఉన్న రెట్టకుళల్ వీధి, టీహెచ్ రోడ్డు ప్రాంతాల్లో డ్రైనేజీ, వాననీటి కాలువల్లో సక్రమంగా పూడికతీత జరుపకపోవడమే వరదనీరు నిలవడానికి కారణమని తెలిపారు. ఈ కేసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీరామ్, న్యాయమూర్తి సెంథిల్ కుమార్ రామమూర్తిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. జీసీసీ తరపు న్యాయవాది హాజరై... పాత వాషర్‌మెన్‌పేట రత్న సభాపతి వీధిలో వాననీటిని పైపుల ద్వారా సముద్రంలో కలిసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పిటిషనర్ తరపు న్యాయవాది అశోక్ అభ్యంతరం తెలుపుతూ... గతంలో కురిసిన వర్షాల సమయంలో తీసిన ఫొటోలను ధర్మాసనం ముందు పెట్టారు. వాటిని పరిశీలించిన ధర్మాసనం... వర్షపు నీరు నిలువకుండా వాషర్‌మెన్‌పేట ప్రాంతంలో ఎటువంటి చర్యలు తీసుకున్నారో ఆధారాలతో సహా నివేదికగా సమర్పించాలంటూ జీసీసీకి ఉత్తర్వులు జారీచేసి కేసు తదుపరి విచారణను ఈ నెల 14వ తేదీకి వాయిదావేసింది.

ఈ యేడాదిలోగా 2500 ఆలయాలకు కుంభాభిషేకం

● దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ యేడాదిలోగా రాష్ట్రంలో 2500 ఆలయాలకు కుంభాభిషేకాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. పురుషవాక్కంలోని గంగాధీశ్వరాలయ కుంభాభిషేకం ఈ నెల 28న జరుగనున్న సందర్భంగా శుక్రవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో శుభ ముహూర్త స్తంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ తొమ్మిది శతాబ్దాలనాటి పురుషవాక్కం గంగాధీశ్వరాలయానికి 2008లో కుంభాభిషేకం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం రూ.4.82 కోట్లతో ఆలయంలో 36 రకాల జీర్ణోద్ధరణ పనులు చేపట్టిందన్నారు. రూ.2.92 కోట్ల ఆలయ నిధుల నుండి 14 పనులు, ఉభయదారులిచ్చిన రూ.1.90 కోట్ల విరాళాలతో 22 జీర్ణోద్ధరణ పనులు నిర్వహించినట్లు ఆయన వివరించారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో 1.29 కోట్లతో ఈ ఆలయ కోనేటి పూడికతీత, మరమ్మతులు నిర్వహించామన్నారు. ఆలయానికి రూ.6 కోట్లతో కొత్త బంగారు రథం నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శుక్రవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జరిగిన 12 ఆలయ కుంభాభిషేకాల సహా ఇప్పటివరకు 2265 ఆలయాల కుంభాభిషేకాలను నిర్విఘ్నంగా నిర్వహించామన్నారు. వచ్చే 11, 14 తేదీలలో 60 ఆలయాలకు కుంభాభిషేకాలు జరుగనున్నాయని చెప్పారు.

విగ్రహాలకు క్యూఆర్ కోడ్‌లు...

విగ్రహాలు చోరీకి గురైనా వాటిని సులువుగా గుర్తించేందుకు క్యూఆర్ కోడ్ అమర్చుతున్నట్లు ఆయన చెప్పారు. ఆ కోడ్ బట్టి విగ్రహాల అక్రమ రవాణా నిరోధక విభాగం కంట్రోల్ రూమ్ నుంచే మాయమైన విగ్రహాలు ఏ ప్రాంతాల్లో ఉన్నాయనే విషయాన్ని సులువుగా గుర్తించగలుగుతామన్నారు. అరు నెలల్లోగా రాష్ట్రంలో అత్యంత విలువైన, ప్రాచీన విగ్రహాలు, శిల్పాలకు ఈ క్యూఆర్ కోడ్ వేసే పనులన్నీ పూర్తవుతాయని ఆయన వివరించారు.



పురుషవాక్కం గంగాధీశ్వరాలయ కుంభాభిషేకం కోసం ముహూర్త స్తంభ స్థాపన చేస్తున్న మంత్రి శేఖర్‌బాబు



కొత్త చిత్రం పూజా కార్యక్రమం

రాజ్‌కుమార్ దర్శకత్వంలో ధనుష్

'అమరన్' చిత్ర దర్శకుడు రాజ్‌కుమార్ పెరియ స్వామి డైరెక్షన్‌లో ధనుష్ తన 55వ చిత్రం చేయనున్నారు. గోపురం ఫిలిమ్స్ పతాకంపై నిర్మాత అన్బుచెళియన్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఈ చిత్రానికి రాజ్‌కుమార్ కథ సమకూర్చి దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రం పూజా కార్యక్రమం శుక్రవారం నగరంలో జరిగింది. ఇందులో జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ పాల్గొని చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. హీరో ధనుష్, దర్శకుడు పెరియస్వామి, నిర్మాతలు అన్బుచెళియన్, సుష్మిత అన్బుచెళియన్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు గురించి నిర్మాత సుష్మిత వివరిస్తూ, 'ధనుష్ - రాజ్‌కుమార్ కాంబినేషన్‌లో గోపురం ఫిలిమ్స్ బ్యానరుపై చిత్రాన్ని నిర్మించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ చిత్రం కూడా గొప్పగా ఉంటుందని భావిస్తున్నామన్నారు. కాగా, రాజ్‌కుమార్ దర్శకత్వం వహించిన 'అమరన్' చిత్రం విడుదలైన అన్ని భాషల్లో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెల్సిందే.

ప్రేమకథా చిత్రం 'నేసిప్పాయ'

● దర్శకుడు విష్ణువర్ధన్

చిత్రజ్యోతి

దివంగత సీనియర్ నటుడు మురళి రెండో కుమారుడు ఆకాష్ మురళిని వెండితెరకు హీరోగా పరిచయం చేస్తూ తాను రూపొందించిన 'నేసిప్పాయ' చిత్రం ఒక స్వచ్ఛమైన ప్రేమ కథ అని ఆ సినిమా దర్శకుడు విష్ణువర్ధన్ వెల్లడించారు. అతిథి శంకర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం. ఎక్స్‌బీ ఫిలిమ్స్ బ్యానరుపై జేవియర్ బ్రిట్టో సమర్పణలో నిర్మాత స్నేహా బ్రిట్టో నిర్మించారు. ఇప్పటికే విడుదల చేసిన ఈ చిత్ర టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇందులో రొమాన్స్, యాక్షన్ సీక్వెన్స్ పుష్కలంగా ఉన్నాయి. ఒకే ఫ్రేమ్‌లో శరత్ కుమార్, ప్రభు, ఖుష్బూ వంటి సీనియర్ నటులను చూపించారు. ఈ నేపథ్యంలో చిత్ర విశేషాలను దర్శకుడు విష్ణువర్ధన్ శుక్రవారం నగరంలో విలేకరులకు వివరించారు. 'ఇప్పటివరకు నేను యాక్షన్ భరిత చిత్రాలనే తెరకెక్కించాను. అజిత్‌తో 'బిల్లా', బాలీవుడ్ చిత్ర 'షేర్షా'తో పాటు నా దర్శకత్వంలో ఇప్పటి వరకు వచ్చిన చిత్రాలతో పోల్చితే పూర్తిగా భిన్నమైనది. రొమాంటిక్ మూవీ. ఒక్క మాటలో చెప్పాలంటే స్వచ్ఛమైన ప్రేమకథ చిత్రం. మధ్యలో ఓ చిన్న ట్విస్ట్ ఉంటుంది. ఇప్పటివరకు అనేక లవ్ స్టోరీ చిత్రాలు వచ్చాయి. వాటికి మా చిత్రానికి ఏమాత్రం పోలిక ఉండదు. చెన్నైలో కథ ప్రారంభమై పోర్చుగల్‌లో సాగుతుంది. పోర్చుగల్‌లో దాదాపు 40 రోజుల పాటు షూటింగ్ చేశాం. కెమెరామెన్, స్టంట్ మాస్టర్ ఇద్దరూ విదేశీయులే. డిసెంబరులో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం. నిర్మాత జేవియర్ బ్రిట్టోకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను. యువన్ శంకర్ రాజా సంగీత సినిమాకు అదనపు బలం. అద్భుతమైన ఆల్బమ్ ఇచ్చారు' అని పేర్కొన్నారు. హీరో ఆకాష్ మురళి మాట్లాడుతూ, 'విష్ణువర్ధన్ దర్శకత్వంలో హీరోగా అరంగేట్రం చేస్తానని ఊహించలేదు. ఈ సినిమాను మరో బ్యానరులో నిర్మించాల్సింది. కానీ, జేవియర్ బ్రిట్టో ముందుకు వచ్చి బడ్జెట్‌తో కాంప్రమైజ్ కాకుండా చిత్రాన్ని నిర్మించారు' అని వెల్లడించారు. విలేకరుల సమావేశంలో నిర్మాత స్నేహ బ్రిట్టో కూడా పాల్గొన్నారు.



'నేసిప్పాయ'లో ఆకాష్ మురళి - అతిథి శంకర్

యోగా ట్రైనర్‌ను పెళ్ళాడిన కోలీవుడ్ హీరోయిన్

'జోకర్' చిత్రం ద్వారా హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమైన హీరోయిన్ రమ్యా పాండ్యన్ తన యోగా ట్రైనర్ లోవల్ ధవను వివాహం చేసుకున్నారు. రిషికేష్ సమీపంలో శివపురి గంగానదీ తీరంలో వీరి వివాహం శుక్రవారం ఉదయం జరిగింది. ఈ వివాహ వేడుకలకు ఇరు కుటుంబ సభ్యులు, స్నేహితులు మాత్రమే హాజరయ్యారు. వీరిలో రమ్యా పాండ్యన్ తల్లి శాంతి, సోదరి త్రిపుర సుందరి, తమ్ముడు పరశురామన్, చిన్నాన్న, నటుడు అరుణ్ పాండ్యన్, ఈయన కుమార్తె కీర్తి పాండ్యన్, అల్లుడు, హీరో అశోక్ సెల్వన్ తదితరులు పాల్గొన్నారు. వీరి వివాహ రిసెప్షన్ కార్యక్రమాన్ని ఈ నెల 15న చెన్నైలో నిర్వహించనున్నారు.



భర్త లోవల్‌తో రమ్యా పాండ్యన్

'కూలీ' చిత్రంలో నటించలేదు

● శివకార్తికేయన్

సూపర్‌స్టార్ రజనీకాంత్ - యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'కూలీ' చిత్రంలో తాను నటించడం లేదని 'అమరన్' హీరో శివకార్తికేయన్ స్పష్టం చేశారు. ఈ విషయంపై ఆయన తాజాగా క్లారిటీ ఇచ్చారు. "మావీరన్' చిత్ర నిర్మాత అరుణ్ విశ్వ, దర్శకులు చంద్రూ, మాడోన్ అశ్విన్, లోకేష్ కనకరాజ్ నాకు మంచి స్నేహితులే. కానీ 'కూలీ' సినిమా షూటింగ్‌లో పాల్గొనలేదు. మా ఇంటికి ఎదురుగానే ఆ చిత్రం షూటింగ్ జరుగుతోంది. అది మా 'తలైవర్' మూవీ. అందువల్ల ఆ మూవీ గురించి తప్పుడు వార్తలను ప్రచారం చేయొద్దని కోరారు. కాగా, మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత చరిత్రను ఆధారంగా చేసుకుని రాజ్‌కుమార్ పెరియస్వామి రూపొందించిన 'అమరన్' చిత్రం హీరో శివకార్తికేయన్ కెరీర్‌లోనే ఓ గొప్ప మూవీగా నిలిచిన విషయం తెల్సిందే.



ఐదు తరాలకు ప్రత్యక్ష సాక్షి

శతవసంతాల సేవాధారి

తరుణి

● ఐదున్నర వేల ప్రసవాల నిర్వహణశీలి లలితా కుళందైవేలు

జీవన మాధుర్యం ఆస్వాదించాలంటే గలగల పారే గోదారిలా నిత్యం చైతన్యంతో జీవించాలి. అప్పుడే శారీరక, మానసిక ఆరోగ్యం మన సొంతం అవుతుంది. దానికి సజీవ సాక్ష్యం లలితా కుళందైవేలు. శతాధిక వృద్ధురాలు, నేటికీ ఉత్సాహమే ఊపిరిగా జీవిస్తూ ఐదు తరాలకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది. ఆమె చేతిలో 5500 మందికి పైగా మహిళలు ప్రసవం చేసుకున్నారు. ఆమె స్ఫూర్తిప్రదాయక జీవన ప్రస్థానం నేటి 'తరుణి'లో....

- వేళచ్చేరి



లలిత జన్మించింది చెన్నైలో. ఎన్నో తరాల కిందట తెలుగు వారైన వీరు క్రమేణా తమిళనాడులో తమిళ సంస్కృతితో మమేకమై పూర్తిగా తమిళులుగా స్థిరపడ్డారు. లలిత కచేరీ రోడ్డులోని శాంతోమ్ హైస్కూలులో 9వ తరగతి వరకు చదివారు. కుటుంబ పరిస్థితుల కారణంగా ఆపై చదువు సాగలేదు. ఆమె తల్లి మునియమ్మ, తండ్రి సుబ్బరాయలు. పుట్టిన పదిరోజులకే లలిత తండ్రిని కోల్పోయింది. ఆమెకు ఒక సోదరుడు, ఇద్దరు సోదరీమణులు. లలిత భర్త కుళందైవేలు ఫొటోగ్రాఫర్. ఈ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు.

జీవితంలో మలుపు ఇలా...

'మేమున్న ఇంటి పక్కనే అప్పట్లో డా.లక్ష్మి అని ఒక వైద్యురాలు ఉండేది. ఆమె నన్ను తనతో పాటు హాస్పిటల్‌కు తీసుకొని వెళ్లి కొన్ని నెలలపాటు ప్రసవాలకి సంబంధించిన విషయాల్లో నాకు శిక్షణ ఇచ్చింది. ఆ డాక్టర్‌కి సహాయకురాలిగా పనిచేసి ప్రసవాలు చేయడంలో అనుభవం సంపాదించాను' అని తన జీవితం మలుపు తిరగడం గురించి తెలిపారు లలిత. అక్కడ పొందిన శిక్షణతో లలిత ఒక ఏడాది పాటు డా.లక్ష్మి పర్యవేక్షణలోనే కాకుండా, ఇంటి దగ్గర కూడా ఎంతోమంది మహిళలకు ప్రసవాలు చేశారు. ఈ తర్వాత కుటుంబం మదురైలో స్థిరపడడంతో అక్కడ మున్సిపల్ ఆస్పత్రిలో 30 ఏళ్లపాటు సేవలందించారు. ఇళ్ల దగ్గర కూడా ఎవరికి అవసరమైనా వెంటనే వెళ్లి తన వంతుగా సాయం చేసేవారు. తన జీవితంలో 5500 పైగా ప్రసవాలు చేసినట్లు గర్వంగా చెబుతారు లలిత.

లలితలో మరో కోణం సేవాభావం. బాల్యం నుండే ఎవరికి ఏ సాయం కావాలన్నా చేయడం ఆమెకు అలవాటు. అది వయసుతో పాటు పెరిగింది. ఒకానొక సమయంలో కలరా మహమ్మారి వ్యాపించినపుడు ఆమె ఎంతో మందికి సహకారం అందించారు. అంతేకాదు, కుష్టురోగులకు, కాన్సర్ పేషెంట్లకు కూడా ఎంతో సేవ చేసినట్లు ఆమె చెబుతారు. 'నా మనోధైర్యం, సాయపడాలన్న తపన నన్ను రోగాలకు దూరం చేసిందన్నారు లలిత. నూరు సంవత్సరాల పండు వయసులో ఇప్పటికీ కూడా గర్భిణులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తుంటారామె. తనకున్నంతలో పేదవారికి భోజనం పెట్టే పెద్ద మనసు ఆమెది.

క్రమశిక్షణ కలిగిన జీవనశైలి

నూరవ పుట్టినరోజు ఇటీవలే జరుపుకున్న లలిత జీవనశైలి క్రమశిక్షణతో కూడుకున్నది. తెల్లవారుజామునే మేల్కొనే ఆమె ఇప్పటికీ ప్రతిరోజు వ్యాయామం తప్పనిసరిగా చేస్తారు. ఉదయం, సాయంత్రం కొద్దిసేపు నడవడం ఆమెకున్న అలవాటు. సాత్విక ఆహారం తీసుకోవడం, మనసులో ఎప్పుడూ ప్రతికూల ఆలోచనలు రాకుండా చూసుకోవడం తన ఆరోగ్య రహస్యమంటారు లలిత. కూతురు, మనవడితో కలసి ఉంటున్న ఆమె తనది సంతృప్తికర జీవితమని, మనవళ్లు అంతా ఉన్నత విద్యావంతులని, తనని ప్రేమతో, ఆప్యాయంగా చూసుకుంటారన్నారు. శిల్ప కళాకారుడైయిన తన అన్న ఇంటికి జెమినీ గణేశన్, అన్నాదురై, కామరాజనాడార్ మొదలైన ఎంతో మంది ప్రముఖులు విచ్చేసేవారని, ఆ సమయంలో తనే వారందరికీ ఆతిథ్యమిచ్చానని, తన పాక ప్రావీణ్యానికి వారు ప్రశంసించడం మరచిపోలేని అనుభూతి అని ఆమె గుర్తు చేసుకున్నారు.

"సమయం ఎవరూ వృధా చేయకూడదు.మ నకు వచ్చిన పనిలో నిమగ్నమవాలి. పరులకు సేవచేయడం, ఆపన్న హస్తం అందించడం మన ధర్మంగా భావించాలి" అంటూ తరుణితో తన అనుభవాలు పంచుకున్నారు లలిత.

అభిరుచులు:

సినిమాలు చూడడం ఆమెకు ఇష్టమైన అభిరుచి. వంటలో ప్రావీణ్యం ఉన్న లలితకు వంట చేయడంపై ఎనలేని ఆసక్తి. ఇప్పటికీ ప్రతి నిత్యం ఇంట్లో తనే వంట చేస్తానని, అందరికీ తన చేతులతో వండి, వడ్డించడం తనకు ఎంతో సంతృప్తి కలిగిస్తుందని లలిత తెలిపారు.



గర్భిణులకు సూచనలు, సలహాలిస్తూ....



కుటుంబ సభ్యులు, ఆత్మీయుల మధ్య జన్మదిన వేడుకల్లో....



రాష్ట్ర మేగ్నసైట్ లిమిటెడ్ రూ.5.72 కోట్ల డివిడెండ్‌ను సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకుని చెక్కురూపంలో అందజేస్తున్న నీటివనరుల శాఖ మంత్రి దురైమురుగన్



2024 సంవత్సరానికిగాను కలైంజర్ కరుణానిధి సెమ్మొళి తమిళ అవార్డుకు ఎంపికైన మద్రాసు విశ్వవిద్యాలయం విశ్రాంత తమిళ ప్రొఫెసర్ ఎం.సెల్వరాజన్‌కు సచివాలయంలో రూ.10లక్షల పురస్కారం, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న సీఎం స్టాలిన్



తమిళభాషాభివృద్ధికోసం పాటుపడిన వీరమామునివర్ జయంతి సందర్భంగా చెన్నై కామరాజర్‌సాలైలో ఉన్న ఆయన విగ్రహం వద్ద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు సామినాధన్, ఎం. సుబ్రమణియం, పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్ ప్రియా తదితరులు

తిరువణ్ణామలైలో మహారథం ట్రయల్ రన్



అశేష భక్తజనం మధ్య మహా రథం ట్రయల్ రన్

ప్యారీస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై శైవక్షేత్రంలో అరుణాచలేశ్వర మహారథం ట్రయల్ రన్ అశేష భక్తజనం మధ్య శుక్రవారం జరిగింది. ఈ ఆలయంలో కార్తీక దీపోత్సవం వచ్చే నెల 13న జరుగనుంది. ఈ ఉత్సవాల్లో ఏడో రోజు నిర్వహించే మహా రథోత్సవంలో ఐదు చిన్న రథాలు కూడా పాల్గొంటాయి. ఈ ఏడాది కార్తీక దీపోత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యే అవకాశమున్నందున ఆలయ అధికారలుఉ ఏర్పాట్లు చేస్తున్నారు. మహా రథోత్సవం కోసం అన్నామలైయార్ రథాన్ని రూ.70 లక్షలతో పునర్నించారు. శుక్రవారం ఉదయం 8.14 గంటలకు ఈ రథం ట్రయల్ రన్‌ను డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి ప్రారంభించారు. కలెక్టర్ భాస్కర పాండ్యన్, ఎస్పీ డా.సుధాకర్, కార్పొరేషన్ కమిషనర్ కాంతిరాజ్ తదితరులు పాల్గొన్నారు. మహా రథం ట్రయల్ రన్ సందర్భంగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం, మాఢవీధులు కిటకిటలాడాయి. రథం ముందు భరత నాట్యం కళాకారులు ఆడుతూ పాడుతూ సందడి చేశారు.



కళాకారుల నృత్య ప్రదర్శన

ప్రత్యామ్నాయ ఇంధన వనరులు ఉపయోగించాలి

● ఐఓసీ చీఫ్ జీఎం రానురామ్ ● మేఘా గ్యాస్ 200వ సీఎన్జీ స్టేషన్ ప్రారంభం



కార్యక్రమంలో నిర్వాహకులు

అడయార్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సీఎన్జీ వంటి ప్రత్యామ్నాయ ఇంధనవనరులను వినియోగించాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ రానురామ్ పిలుపునిచ్చారు. మేఘా గ్యాస్ దేశంలోని తన 200 సీఎన్జీ గ్యాస్ స్టేషన్‌ను తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణామలై జిల్లా దిండివనంలో నెలకొల్పారు. దీనిని ప్రారంభించిన రానురామ్ మాట్లాడుతూ, ప్రజలు సీఎన్జీ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వినియోగించడం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. సీఎన్జీలకు ప్రభుత్వాలు సహకరిస్తున్న తీరు మరువలేదన్నారు. మేఘా గ్యాస్ మదర్ సీఎన్జీ స్టేషన్, చెయ్యార్‌లో ఎల్‌సీఎన్జీ ప్లాంట్‌లను ప్రారంభించినందుకు అభినందన తెఇలపారు. మేఘా గ్యాస్ డైరెక్టర్, సీఈవో వెంకటేష్ పలింపాటి మాట్లాడుతూ, 200వ సీఎన్జీ గ్యాస్ స్టేషన్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే మరో వంద సీఎన్జీ స్టేషన్లను ప్రారంభించనున్నట్టు తెలిపారు. దేశ వ్యాప్తంగా వెయ్యి సీఎన్జీ స్టేషన్లను నెలకొల్పాన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టు వెల్లడించారు. తమ వ్యాపారాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తమిళనాడులోని తిరువణ్ణామలై, తంజావూరు, పెరంబలూరు, దిండిగల్ జిల్లాల్లో మేఘా గ్యాస్ సీఎన్జీ కార్యకలాపాలను విస్తరిస్తామని, ఇందుకోసం తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వంతో గత జనవరిలోనే ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు.

తిరుత్తణిలో మురుగన్ తిరుకల్యాణం




కుమారస్వామికి పుష్పాభిషేకం

ప్యారీస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి కొండపై వెలసిన సుబ్రమణ్యస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం వల్లి దేవసేన సమేత కుమారస్వామి తిరుకల్యాణం వైభవంగా జరిగింది. సుబ్రమణ్యస్వామి కొలువైన ఆరుపడై వీడులో ఐదవదిగా ప్రసిద్ధిగాంచిన తిరుత్తణి క్షేత్రంలో ఈ ఏడాది స్కందషష్ఠి ఉత్సవాలు ఈ నెల 2న ప్రారంభమయ్యాయి. స్వామివారు పుష్ప అలంకారం, పట్టువస్త్రాల అలంకారం, బంగారు, వెండి కవచం తదితర అలంకారాల్లో ప్రతిరోజు భక్తులకు దర్శనమిస్తున్నారు. 6వ రోజైన గురువారం తెల్లవారుజామున మూలవర్‌ను గంధంతో అభిషేకించి ఆరు టన్నుల పుష్పాలతో వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. రాష్ట్రంలోని సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో గురురాత్రి శూరసంహారం అంగరంగ వైభవంగా జరిగింది. అయితే తిరుత్తణి ఆలయంలో మాత్రం శూరపద్మని వధించిన స్వామివారికి అలసట తీరేలా 12 రకాల పుష్పాలతో యాగం నిర్వహించారు. శుక్రవారం ఉదయం వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కల్యాణ ఘట్టాన్ని ఆలయ పురోహితులు శాస్త్రోక్తంగా నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

'ఈక్విటాస్'లో రేడియేషన్ థెరపి

ప్యారీస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఈక్విటాస్ ఆస్పత్రిలో ఆధునిక వసతులతో కూడిన క్యాన్సర్ రేడియేషన్ థెరపీ విభాగాన్ని శృంగేరి శారదా పీఠం మఠాధిపతి విదుశేఖర భారతీస్వామి ప్రత్యేక పూజలుచేసి ప్రారంభించారు. ప్రస్తుతం పెరిగిపోతున్న క్యాన్సర్ బాధితులకు తక్కువ ఫీజుతో రేషియేషన్ థెరపీ అందించాలన్న లక్ష్యంతో ఈ విభాగాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో క్యాన్సర్ కేర్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ వైదీశ్వరన్ వేలాయుధం, జెమ్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ సి.పళనివేల్, నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ మాజీ హెడ్ ప్రొఫెసర్ జీకే రథ్, ఈక్విటాస్ హెల్త్‌కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వాసుదేవన్, ప్రెసిడెంట్ ఆర్కాట్ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రేడియేషన్ థెరఫీ విభాగాన్ని ప్రారంభిస్తున్న విదుశేఖర భారతీ స్వామి తదితరులు

రోబోటిక్ గైనకాలజీ సర్జరీలో


గ్లోబెల్ హాస్పిటల్ రికార్డు



ఆసుపత్రి వైద్య బృందం

అడయార్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఒకటైన చెన్నై గ్లెనెగ్లెస్ హాస్పిటల్ రాష్ట్రంలో సరికొత్త రికార్డు నెలకొల్పింది. 200కు పైగా రోబోటిక్ గైనకాలజీ సర్జరీలు చేసిన తొలి హాస్పిటల్‌గా తమిళనాడులో రికార్డు నెలకొల్పింది. ఇది మహిళల ఆరోగ్యంలో సాధించిన గణనీయమైన పురోగతిగా ఆస్పత్రి వైద్యులు అభివర్ణించారు. ఈ ఆపరేషన్ చేయించుకున్న మహిళలను 16 నుంచి 18 గంటల్లో డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు. ఈ విషయంపై గ్లెనెగ్లెస్ హాస్పిటల్ సీఈవో డాక్టర్ నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, గత దశాబ్దకాలంలో మహిళలు తమ కెరీర్, కుటుంబంతో పాటు తమ ఆరోగ్యంపై అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనికి కారణం రోబోటిక్ సర్జరీలు అందుబాటులోకి రావడమేనని వివరించారు. ఈ తరహా సర్జరీలు ఖచ్చితత్వంతో కూడా రోగి త్వరగా కోలుకోవడానికి ఎంతగానో దోహదపడుతుందని ప్రసూతి, గైనకాలజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ పద్మప్రియ పేర్కొన్నారు. గడిచిన ఏడాదిన్నర కాలంలో 200 మందికిపైగా మహిళలు ఈ సర్జరీలను ఎంచుకున్నారు.


పనబాక లక్ష్మి


జ్యోతుల నెహ్రూ


కృష్ణమూర్తి వైద్యనాథన్


సదాశివరావు


సౌరభ్ బోరా

టీటీడీ బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారం

తిరుమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యులుగా జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, సౌరభ్ బోరా, సదాశివరావు, కృష్ణమూర్తి వైద్యనాథన్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు.అనంతరం శ్రీవారిని దర్శించుకుని రంగనాయక మండపానికి చేరుకున్న వారిని వేదపండితులు ఆశీర్వదించారు.అదనపు ఈవో శ్రీవారి చిత్రపటాలు,లడ్డూప్రసాదాలు అందజేశారు. ప్రమాణస్వీకారం అనంతరం పనబాక లక్ష్మి మీడియాతో మాట్లాడుతూ.. తనను టీటీడీ బోర్డు సభ్యురాలిగా నియమించిన సీఎం చంద్రబాబుకు, లోకేశ్‌కు ధన్యవాదాలు అన్నారు.దేవదేవుడికి సేవ చేసుకునే అదృష్టం కలిగించిన సీఎంకు జ్యోతుల నెహ్రూ కృతజ్ఞతలు తెలిపారు.తిరుమలకు సామాన్యుడిగా, వీఐపీగా వచ్చిన సందర్భాలున్నాయన్నారు. ఆ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సేవలందిస్తానన్నారు.

వేద విద్యార్థులు సనాతన ధర్మాన్ని ప్రబోధించాలి

● టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): వేద విద్యార్థులందరూ తమ కోర్సుల్లో నైపుణ్యం సాధించి సనాతన ధర్మాన్ని ప్రబోధించాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కోరారు. తిరుమలలోని ధర్మగిరి వేద విజ్ఞాన పీఠాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. తొలిసారిగా వేదవిజ్ఞాన పీఠానికి వచ్చిన చైర్మన్‌కు ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ అవధాని వేదమంత్రోచ్చారణల నడుమ వేదాశీర్వచనం నిర్వహించి సంప్రదాయపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులతో చైర్మన్ మాట్లాడుతూ.. ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని, మరోసారి త్వరలో విద్యార్థులందరినీ కలుస్తానన్నారు. సనాతన ధర్మాన్ని మరింత ఉన్న శిఖరాలకు తీసుకెళ్లాలన్నదే తమ సంకల్పమన్నారు. తొలుత ప్రిన్సిపాల్ తిరుమలలో వైదిక సంస్థ ఆవిర్భావం, ప్రాభవం గురించి చైర్మన్‌కు వివరించారు. అక్కడి నుంచి చైర్మన్ తిరుమలలోని గోశాలను సందర్శించారు. నవనీత సేవలో స్వయంగా పాల్గొని సేవకులు చేస్తున్న సేవలను పరిశీలించారు. ఏకాంత సేవకు వినియోగించే వెన్నను తయారు చేసే విధానాన్ని చూశారు. వెన్నను స్వయంగా తన చేతులపై సేవకులకు అందజేశారు. గోపూజలోనూ పాల్గొన్నారు. అక్కడి నుంచి పెద్దజీయర్ మఠానికి వెళ్లి పెద్దజీయర్ స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. తర్వాత అఖిలాండం వద్ద కొబ్బరికాయ కొట్టి బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమాల్లో ధర్మగిరి ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ ప్రసాద్, గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరకలెత్తిన యువ తరంగం











స్టెప్పులేశారు. పాటలుపాడారు. శాస్త్రీయ నృత్యాభినయంతో అలరించారు. దేవతామూర్తులు, శ్రీకృష్ణదేవరాయలు, అష్టదిగ్గజాలు.. ఇలా విభిన్న వేషధారణలతో ఆకట్టుకున్నారు. కోలాటాలతో ప్రదర్శన ఇచ్చారు. చదువులోనే కాదు కళలలోనూ తమ ప్రావీణ్యాన్ని చాటారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో శుక్రవారం ప్రారంభమైన మూడు రోజుల 'యువ తరంగ్' కార్యక్రమంలో యువోత్సాహం ఉరకలెత్తింది. శ్రీనివాస ఆడిటోరియం వేదికగా కార్యక్రమాలు జరిగాయి. అంతకుముందు యూనివర్సిటీ ప్రాంగణంలో కళా బృందాల ర్యాలీ, ప్రదర్శన ఆకట్టుకుంది. పలు కళాశాలలకు చెందిన వేలాది మంది కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.









నేటి కార్యక్రమాలిలా..

శనివారం ఉదయం 10 నంచి యూనివర్సిటీలోని పలు కేంద్రాల్లో వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు ప్లాస్టిక్‌రహిత తిరుపతి అంశంపై శ్రీనివాసా ఆడిటోరియంలో సామాజిక కార్యకర్త శివాజీ పలేటి ప్రసంగించనున్నారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

అత్యవసర సేవకులకు జీతాలెక్కడ?

● నాలుగు నెలలుగా 108, 104 సిబ్బందికి అందని వేతనాలు


వేతనాలు చెల్లించాలని ఇటీవల నిరసన వ్యక్తం చేస్తున్న 108 సిబ్బంది

తిరుపతి(వైద్యం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు చేర్చి వైద్య సేవలు అందేలా చూసే 108, పల్లెవాసుల ఆరోగ్య భద్రతకు క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందించే 104 సిబ్బంది సమస్యలు ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. నాలుగు నెలలుగా జీతాలు అందక వారు అవస్థలు పడుతున్నారు. కుటుంబ పోషణ భారమై అప్పులు చేసి, కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది.

తిరుపతి జిల్లా పరిధిలో 108 వాహనాలు 41, 104 వాహనాలు 34 ఉన్నాయి. అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ వీటి నిర్వహణ బాధ్యతలు చూస్తోంది. ఒప్పంద ప్రాతిపదికన సిబ్బంది పనిచేస్తున్నారు. 108 వాహనంలో ఇద్దరు చొప్పున డ్రైవర్లు, టెక్నీషియన్లు ఉంటారు. సీనియర్ డ్రైవర్లకు నెలకు రూ.27 వేలు, జూనియర్లకు రూ.16 వేలు వేతనం ఇస్తారు. సీనియర్ టెక్నీషియన్‌కు రూ.28 వేలు, జూనియర్లకు రూ.16 వేలు ఇస్తారు. 104 వాహనంలో డ్రైవర్లకు రూ.24 వేలు, రూ.13 వేలు చొప్పున, డీఈవో(డేటా ఎంట్రీ ఆపరేటర్)లకు రూ.13వేలు చొప్పున వేతనం చెల్లిస్తారు. నాలుగు నెలలుగా జీతాలందక ఆర్థికంగా సతమతమవుతున్నారు. 102 తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో పనిచేసే సిబ్బందిదీ ఇదే పరిస్థితి.

ఏనాడూ సకాలంలో అందని వేతనాలు

108, 104 వాహనాల్లో పనిచేసే సిబ్బందికి ప్రారంభం నుంచి ఏనాడూ సకాలంలో జీతాలు అందలేదు. ప్రతినెలా ఎదురు చూపులు తప్పడం లేదు. ఇదేమని సంస్థ నిర్వాహకులను అడిగితే ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని సమాధానం చెబుతున్నారని, దసరా, దీపావళి వంటి పండుగల సమయాల్లోనూ జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల్లో, క్రెడిట్ కార్డుల్లో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించి, సకాలంలో జీతాలు అందేవిధంగా చూడాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు.

వండలూరు జూకు
రూ.3 లక్షల విరాళం


జూ డైరెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న అప్సర రెడ్డి, నిక్కీ గల్రానీ

అడయార్, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): వన్యప్రాణుల సంరక్షణ కోసం గుడ్ డీడ్స్ క్లబ్ తరపున వండలూరు జంతు ప్రదర్శనశాలకు ప్రముఖ సంఘ సేవకులు అప్సర రెడ్డి సినీ నటి నిక్కీ గల్రానీ రూ.3 లక్షల విరాళం అందించారు. ఈ మొత్తాన్ని వండలూరు జూ డైరెక్టర్ ఆశీష్ శ్రీవాత్సవకు అందజేశారు. గుడ్ ఈట్స్ క్లబ్, అప్సర రెడ్డి ఉదారగుణానికి ఈ సందర్భంగా ఈయన దన్యవాదాలు, తెలిపారు. ఆ తర్వాత అప్సరా రెడ్డి మాట్లాడుతూ, నిరాశ్రయులకు పునరావాసం కల్పించేందుకు గుడ్ డీడ్స్ క్లబ్ ఏర్పాటు చేశామన్నారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం తమ వంతు సాయం చేశామని, ఇలాగే ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అప్సర రెడ్డి కోరారు.

కార్తీకమాస
ప్రత్యేక టూర్ ప్యాకేజీ

తిరుపతి అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కార్తీకమాస ప్రత్యేక టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేసినట్లు ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ సి.హెచ్.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వివరాలను వెల్లడించారు.

● **మహానంది-శ్రీశైలం టూర్ :** మహానంది, శ్రీశైలం నాన్ ఏసీ బస్సు ఈ నెల 16, 23 తేదీల్లో ఉదయం 9గంటలకు బయల్దేరి మూడో రోజు ఉదయం 6 గంటలకు తిరిగి వస్తుంది.పెద్దలకు రూ.3,300,పిల్లలకు రూ.2,540 చెల్లించాలి.

● **తలకోన టూర్ :** తలకోన, శ్రీనివాసమంగాపురానికి ప్రతి ఆది, సోమవారాల్లో నడుస్తుంది. ఉదయం 9 గంటలకు బయల్దేరి సాయంత్రం 5గంటలకు తిరిగి వస్తుంది. ఒక్కొక్కరికి రూ.400 చెల్లించాలి.

● **గుడిమల్లం టూర్ :** రోజూ తిరుచానూరు, అప్పలాయగుంట, గుడిమల్లం మీదుగా నడుస్తుంది. ఒక్కొక్కరికి రూ. 400 చెల్లించాలి.

తిరుపతి విష్ణునివాసం నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయి. మరిన్ని వివరాల కోసం 9848007033, 0877-2289123లను సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రతిభను వెలికి తీసేందుకు
పోటీలు దోహదం చేస్తాయి

● మాజీ మంత్రి గల్లా అరుణకుమారి
● డాక్టర్ జగదీశ్‌కి గల్లా జీవితసాఫల్య పురస్కారం ప్రదానం
● ముగిసిన క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ 10వ వార్షికోత్సవాలు


జగదీశ్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న అరుణకుమారి

తిరుపతిరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కంపెనీలలో పనిచేసే ఉద్యోగుల్లో అంతర్లీనమై ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని మాజీమంత్రి గల్లా అరుణకుమారి అన్నారు. ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ 10వ వార్షికోత్సవాలు శుక్రవారం ముగిశాయి. క్వాలిటీ ఫోరమ్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్‌ని స్థాపించడంలో ప్రధాన భూమిక పోషించి, దానికి ఆర్థికంగా, సంస్థాగతంగా సహాయసహకారాలు అందించిన అమరరాజా గ్రూప్స్ వ్యవస్థాపక చైర్మన్ గల్లా రామచంద్రనాయుడు గౌరవార్థం ఆయన పేరుపై గల్లా జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రవేశపెట్టారు. ఆరోగ్య రంగంలో విశిష్ట సేవలందించిన డాక్టర్ జగదీశ్‌కి ఈ అవార్డును ముఖ్య అతిథిగా హాజరైన అరుణకుమారి చేతుల మీదుగా అందజేశారు. ఆమె మాట్లాడుతూ దేశంలోని అతిపెద్ద సర్కిల్స్‌లో తిరుపతి చాప్టర్ ఒకటిగా ఉండడం చాలా సంతోషదాయకమన్నారు. చాప్టర్ ఆధ్వర్యంలో ఇటువంటి బృహత్తర కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఉద్యోగుల ప్రతిభను వెలికితీసే అవకాశం ఉంటుందని, అలాగే సంస్థల్లో క్వాలిటీ విభాగాన్ని మెరుగుపరచుకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. అవార్డు గ్రహీత డాక్టర్ జగదీశ్ మాట్లాడుతూ ఈ పురస్కారం అందుకోవడం చాలా సంతోషంగా ఉందని, వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి అత్యున్నత స్థాయికి ఎదిగిన రామచంద్రనాయుడు అనేక సంస్థలను ఏర్పాటు చేసి వేలాదిమందికి ఉపాధి కల్పిస్తుండడం అభినందనీయమని పేర్కొన్నారు. అవార్డు అందించిన క్వాలిటీఫోరమ్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్‌కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కాగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సంస్థల నుంచి దాదాపు 2వేలమంది, 303బృందాలు హాజరయ్యాయి. వివిధ సమస్యలకు వారు కనుగొన్న పరిష్కార మార్గాలు, సాధించిన ఫలితాలను ఈ పోటీల్లో వివరించారు. 20 బృందాలకు బెస్ట్ క్వాలిటీ సర్కిల్ అవార్డులు, క్వాలిటీ సర్కిల్స్ అమలు చేయడంలో ప్రధాన పాత్ర పోషించిన పది సంస్థలకు, నాయకత్వ ప్రతిభచాటిన 15మంది ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేశారు. అలాగే బంగారు, వెండి పతకాలను అందజేశారు. ఏపీఐఐసీ చీఫ్ జనరల్ మేనేజర్ ఐఎల్ రామ్, ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ గంగిరెడ్డి, అమరరాజ చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ ఢిల్లీబాబు, బ్లిస్ హోటల్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, రాక్మెన్ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ జగదీశ్, తిరుపతి చాప్టర్ చైర్మన్ జగన్‌మోహన్, జనరల్ సెక్రటరీ సులోచన తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రాలయం రాఘవేంద్ర మఠాధిపతి సుబుదేంద్రతీర్థస్వామి, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జనార్దన్‌రావు, విరుపాక్ష, విష్ణుకుమార్ రాజు, క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్, గాయకుడు కార్తీక్, సినీనటుడు గబ్బర్‌సింగ్ సాయి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.






కార్తీక్ - సుబుదేంద్రతీర్థ స్వామి - కృష్ణమాచారి శ్రీకాంత్